# కేసు నమోదు చేయడం సిగ్గుచేటు

**రాజ్‌కుమార్‌పై ఫిర్యాదును ఖండించిన చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు**

చెన్నూర్ రూరల్, జూన్ 17 : బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేయడాన్ని చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు తీవ్రంగా ఖడించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కలగూర రాజ్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు కావాలనే కేసు నమోదు చేయించారని సోమవారం ఒక ప్రకటన ద్వారా మండిపడ్డారు. చెన్నూర్-భీమారం మధ్యలోని జోడువాగు సమీపంలో రోడ్డు అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ నాయకులను సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు భీమారం పోలీస్‌స్టేషన్‌లో రాజ్ కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయించడం సరికాదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండి, ప్రశ్నిస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రతీ రోజూ లేనిపోని ఆరోపణలు చేశారని, అభివృద్ధిని అడ్డుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ వారిపై ఒక్కసారి కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌పై ఎన్నో తప్పుడు ఆరోపణలు చేస్తూ మాట్లాడారని, ఎవరిపైనా కేసులు పెట్టలేదని స్పష్టం చేశారు. ఇలా ప్రశ్నిస్తే కేసులు పెడితే బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించడం మానుకోబోరని, ప్రజల పక్షాన తప్పకుండా ప్రశ్నించి తీరుతామని పేర్కొన్నారు.



బ్రాండెడ్ లేబర్ కాలనీలో నిరసన తెలుపుతున్న మహిళలు

# పోచమ్మ వాడలో నీటి సమస్య తీర్చండి

భీమారం, జూన్ 17 : భీమారం గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రాడెంట్ లేబర్ కాలనీలో గల పోచమ్మ కాలనీకి తాగునీ నీటి సమస్యను తీర్చాలని మహిళలు కోరారు. ఈ మేరకు సోమవారం రోడ్డుపై ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. మూడు నెలలుగా తాగునీరు సరిగా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు మల్లేశ్వరి, శైలజ, జలంపల్లి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

# సమస్యలు వెంటనే పరిష్కరించాలి

చెన్నూర్, జూన్ 17 : చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టి వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో డ్రైనేజీ, తాగునీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపాల్ అధికారులకు సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పోడు భూములు సమస్య, పలు రహదారుల నిర్మాణానికి అటవీశాఖ అనుమతుల గురించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**ఎల్‌వోసీ అందజేత..**

చెన్నూర్ పట్టణానికి చెందిన సోలంకి శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతని చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2 లక్షలు మంజూరవగా అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఖబ్రస్తాన్‌లో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దండేపల్లి : తాళ్లపేటలోని ఈద్గా వద్ద ఇమామ్ సందేశాన్ని వింటున్న ముస్లింలు



తాండూర్ : ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు,నాయకులు

# ఘనంగా ఈద్-ఉల్-అజ్‌హ

- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బక్రీద్ వేడుకలు
- మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింల ప్రార్థనలు
- సందేశం వినిపించిన ఇమామ్‌లు
- ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ (ఈద్-ఉల్-అజ్‌హ) వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్దకు వెళ్లి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త ఇబ్రహీం కుమారుడు ఇస్మాయిల్ త్యాగానికి గుర్తుగా, ఆయనను స్మరించుకున్నారు. ఇమామ్‌లు తమ సందేశాన్ని వినిపించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని, శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆ తర్వాత ఖబ్రస్తాన్‌లోని తమ పెద్దల సమాధుల వద్దకు వెళ్లి, ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మసీదులు, ఖబ్రస్తాన్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**- మంచిర్యాల ఏసీసీ/దండేపల్లి/జన్నారం/తాండూర్/నెన్నెల/సీసీసీ నస్పూర్/లక్షెట్టిపేట/కన్నెపల్లి/చెన్నూర్ టౌన్/మందమర్రి/కాసిపేట/ఆసిఫాబాద్ టౌన్/కెరమెరి/జైనూర్ జూన్ 17**



సీసీసీ నస్పూర్ : సీసీసీ జామా మసీదు ఈద్గా వద్ద ..

- మంచిర్యాల మున్సిపాలిటీలోని మసీదు (బస్టాండ్), ఈద్గా (క్వారీ రోడ్డు)వద్ద ముస్లింలు, మత పెద్దలు, చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు ఎర్రం తిరుపతి, వొడ్నాల రవీందర్, జూపాక సుధీర్, పడాల శ్రీనివాస్, మంతెన గట్టయ్య, వేముల గురువయ్య, కర్ల తిరుపతి, పడాల రవీందర్, మహమ్మద్ రఫీ, కర్రు శంకర్, గొర్ల సంతోష్, దామోదర్, బాపు, నరేందర్ పటేల్ తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.
- దండేపల్లి మండలంలోని తాళ్లపేట, ముత్యంపేట, దండేపల్లి, రెబ్బెన్‌పెల్లి, ద్వారక గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ సందేశాన్ని శ్రద్ధగా విన్నారు.
- జన్నారం మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో ముస్లింలు ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభకాంక్షలు తెలుపుతూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.
- తాండూర్ మండల కేంద్రంతోపాటు, ఐబీ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీ సిరంగి శంకర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు రహమత్‌ఖాన్, నాయకులు ఎస్ మహేందర్‌రావు, దత్తాత్రేయరావు, గట్టు మురళీధర్ రావు, ఎండీ ఈసా, పెర్క రాజన్న, పొద్దబోయిన శంకర్, కుమ్మరి సత్యం, మాస వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఏ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తాండూర్ సీఐ కే కుమారస్వామి ఆధ్వర్యంలో ఎస్ఐ సీహెచ్ కిరణ్‌కుమార్, పోలీసులు మసీదులు, ఖబ్రస్తాన్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.




మంచిర్యాలలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు..

- నెన్నెల మండల కేంద్రంతో పాటు, ఆవుడం, మైలారం, చిత్తాపూర్ గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- సీసీసీ నస్పూర్‌లోని విలేజ్ నస్పూర్, ఫ్లడ్‌కాలనీ, ఆర్కే-5కాలనీ, గాంధీనగర్, తదితర ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఐ ఆకుల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాలను మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ సందర్శించారు. అనంతరం ముస్లింలు కుర్బానీ కార్యక్రమాన్ని చేపట్టారు. సీసీసీ జామా మసీద్ ఈద్గా వద్ద సదర్ మహ్మద్ మౌలానా, ఆర్కే-5గని మేనేజర్ అబ్దుల్ ఖదీర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.
- లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక ఖబ్రస్తాన్‌లోని తమ పెద్దల సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, ప్రార్థనలు చేశారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు, పాలకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.
- కన్నెపల్లి, భీమిని మండలాల్లో పండుగ ఘనంగా జరుపుకొన్నారు. ముత్తాపూర్ గ్రామంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్నేహితులు, బంధువులకు ఇండ్లలో విందులు ఇచ్చారు.
- చెన్నూర్ పట్టణంలో బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఎమ్మెల్యే వివేక్‌తో పాటు పులువురు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ సీఐ రవీందర్ పాల్గొన్నారు.
- మందమర్రి పట్టణంలో ముస్లింలు బక్రీద్ ఘనంగా జరుపుకొన్నారు. ఎమ్మెల్యే వివేక్ ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొని, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ముస్లింలు వారివారి సన్నిహితులు, బంధువులు, పరిచయస్తులను ఇండ్లకు పిలిచి, విందు ఇచ్చారు.
- కాసిపేట మండలంలో పండుగను ఘనంగా జరుపుకొన్నారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయుల ఆధ్వర్యంలో పోలీసులు ఆయా ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్ బూర రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాబాపూర్ రోడ్డులో గల ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, జడ్పీటీసీ నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తారిక్, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- కెరమెరి మండలంలోని సుల్తాన్‌గూడ, ఝరి గ్రామాల ముస్లింలు ఈద్గ వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
- జైనూర్ మండల కేంద్రంతో పాటు జంగాం, గౌరి, తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ఈద్ నమాజ్ చేశారు. మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



లక్షెట్టిపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చెన్నూర్ టౌన్ : ఈద్గా వద్ద..



కెరమెరి : సుల్తాన్‌గూడలోని ఈద్గా వద్ద..

# చినుకు కోసం.. అన్నదాతల ఎదురుచూపు



చేనులో దుక్కి దున్నుతున్న ట్రాక్టర్



ఎరువులను తీసుకెళ్తున్న రైతులు

- కరుణించని వరుణదేవుడు
- ఆలస్యమవుతున్న సాగు
- ఎరువులు, మందులు, విత్తనాలు సిద్ధం
- ఆందోళనలో రైతాంగం

నెన్నెల, జూన్ 17 : రైతాంగం.. చినుకు కోసం ఎదురుచూస్తున్నది. కాలం మొదలై రెండువారాలు కావస్తున్నా.. వరుణదేవుడి కరుణ కరువైంది. తద్వారా సాగు ఆలస్యమవుతున్నది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. నెన్నెల మండలంలో పత్తి వేద్దామనుకున్న అన్నదాతలకు.. దుక్కి రాక ఏ చేను చూసిన బీళ్లుగానే కనబడుతున్నది. నేల పూర్తిగా పొడిబారిపోవడంతో అక్కడక్కడా ట్రాక్టర్లతో దున్నినా పెద్ద పెద్ద మట్టి పెళ్లలే ఉంటున్నాయి. జూన్ చివరి వరకు పత్తి విత్తుకోవడం పూర్తి కావాలి. కానీ, ఇప్పటికీ దుక్కులే పూర్తికాలేదు. వర్షం పడకుండాపోతుందా అనే ధైర్యంతో కొందరు రైతులు ఎండిన మట్టిలోనే పత్తి గింజలు విత్తుతున్నారు. బోర్లు, బావుల కింద వరి సాగుచేసే రైతులు కూడా నారుమడి సిద్ధం చేసేందుకు ఆలోచిస్తున్నారు. ముందుగానే ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. గతేడాది జూన్ మూడోవారం వరకు పూర్తిస్థాయిలో పత్తి విత్తుకున్నామని, ఎంత ముందుగా వేస్తే అంత దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్‌లో కురిసిన వర్షం తప్ప, భారీ వాన ఎన్నడూ పడలేదని, అక్కడక్కడా కురిసినా లాభం లేకుండాపోయిందని ఆందోళన చెందుతున్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

- వ్యసనాలకు దూరంగా ఉండాలి
- లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్
- కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువకులకు క్రీడా కిట్ల పంపిణీ



లక్షెట్టిపేట : వెంకట్రావుపేటలో కిట్లు అందజేస్తున్న సీఐ నరేందర్, ఎస్ఐ

లక్షెట్టిపేట, జూన్ 16 : యువత క్రీడలపై దృష్టి పెట్టి, ఆసక్తి చూపాలని లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని చందారం, హన్మంత్‌పల్లి, జెండా వెంకటాపూర్, వెంకట్రావుపేట గ్రామాల్లో సోమవారం యువకులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. యువత సత్ప్రవర్తనతో ఉండాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఎస్ఐ చంద్రకుమార్, ఆయా గ్రామాల నాయకులు యువకులు ఉన్నారు.

**దండేపల్లిలో క్రికెట్ కిట్లు, టీ షర్టులు..**

దండేపల్లి, జూన్ 17 : కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో తానిమడుగు, రాజుగూడ, వందూర్‌గూడ, బెహ్రూన్‌గూడకు చెందిన గిరిజన యువకులకు ఎస్ఐ భూమేశ్ క్రికెట్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. అసాంఘిక శక్తుల గురించి ఎలాంటి సమాచారం ఉన్నా డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**ఖర్జీ భీంపూర్, చిన్నగుడిపేట గ్రామాల్లో..**

కన్నెపల్లి, జూన్ 17 : పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా భీమిని మండలం ఖర్జీ భీంపూర్, చిన్నగుడిపేట గ్రామాల్లోని యువకులకు సోమవారం ఎస్ఐ విజయ్‌కుమార్ వాలీబాల్ కిట్లను అందజేశారు. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.



దండేపల్లి : క్రికెట్ కిట్లు, టీ షర్టులు అందజేస్తున్న ఎస్ఐ భూమేశ్



కన్నెపల్లి : యువకులకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

# వీధి దీపాలు ఏర్పాటు చేయండి

భీమారం, జూన్ 17 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. 20 రోజులుగా విద్యుత్ లేక కాలనీవాసులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షం కాలమని, పాములు, తేళ్లు వచ్చే ప్రమాదంపన్నదని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో వెలగని వీధి దీపాలు

# అంతర్రాష్ట్ర కూలీలు వివరాలు ఇవ్వాలి

లక్షెట్టిపేట, జూన్ 17 : ఇతర రాష్ట్రాల నుంచి పనికోసం వస్తున్న కూలీల తమ వివరాలను తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని లక్షెట్టిపేట సీఐ నరేందర్ సూచించారు. రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సోమవారం ఎస్ఐ చంద్రకుమార్, సిబ్బందితో మండలంలోని రైస్ మిల్లుల్లో ఉపాధి కోసం వచ్చిన కూలీల వివరాలు, ఆధార్ కార్డులు సేకరించారు. కూలీలు ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు.

# సామూహిక గాయత్రీ జపం

చెన్నూర్ టౌన్, జూన్ 17 : శ్రీ గాయత్రీ మాత జన్మదినం సందర్భంగా చెన్నూర్ పట్టణంలోని బ్రాహ్మణ సంఘం భవనంలో సోమవారం శ్రీ గాయత్రీ జపం నిర్వహించారు. మొదట గాయత్రీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కేవీఎం శ్రీనివాస్, కార్యదర్శి కొమ్మెర రాజేశ్వరర్ రావు, పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొన్నారు.



సామూహిక గాయత్రీ జపం చేస్తున్న బ్రాహ్మణులు

# చికిత్స పొందుతూ ఒకరి మృతి

జన్నారం, జూన్ 17 : జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన వెన్నెల గోపి(35) శనివారం పురుగుల మందు తాగగా, సోమవాం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందివాడ మండలం పొనుంమాడ్ గ్రామానికి చెందిన వెన్నెల గోపి-పావని దంపతులు. కుటుంబ సభ్యులతో కలిసి పొనకల్‌కు ఉపాధి కోసం వచ్చారు. ఇక్కడ వెల్డింగ్ షాప్ నడుపుతూ జీవిస్తున్నారు. ప్రస్తుతం గిరాకీ సరిగా లేకపోడంతో మనస్తాపం చెంది శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి, జన్నారం ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్‌లోని దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి విజయవాడలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తుననట్లు ఎస్ఐ తెలిపారు.

# యువతకు అండగా ఉంటా..

భీమారం, జూన్ 17 : మండల యువతకు తాము అండగా ఉంటామని ఆర్కే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భూక్యా రాజ్ కుమార్ నాయక్ పేర్కొన్నారు. బూర్గుపల్లి యువతకు సోమవారం కబడ్డీ టీ షర్ట్స్, షాట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువత భూక్యా రాజేశ్ నాయక్, నవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న రాజ్ కుమార్ నాయక్

# ఆడుకుంటూ వెళ్లి మృత్యువాత

- ఇనుప కూలర్ షాక్ తగిలి సిర్పూర్(టీ)లో బాలిక దుర్మరణం

సిర్పూర్(టీ), జూన్ 17 : ఆడుకుంటూ వెళ్లిన ఓ బాలిక ఇనుప కూలర్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని దుబ్బగూడ కాలనీలో సోమవారం జరిగింది. ఎస్ఐ దీకొండ రమేశ్ కథనం ప్రకారం. దుబ్బగూడ కాలనీకి చెందిన ఎల్ములే వరలక్ష్మి(12) సోమవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి దాగుడుమూతలు ఆడుకుంటున్నది. ఈ క్రమంలో ఇంట్లోకి వెళ్లి, కూలర్ పక్కన దాక్కున్నది. కూలర్‌కు తగలడంతో షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి ఎల్ములే గజానన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.